క్లుప్తంగా

అమ్మవారిశాలలో హోమం



హోమం నిర్వహిస్తున్న వాసవి మాలధారులు

మైదుకూరు : మైదుకూరులోని వాసవి కన్యకాప రమేశ్వరి ఆలయంలో బుధవారం హోమం నిర్వహించారు. వాసవిమాలధారులు కుటుంబ సభ్యులతో కలసి హోమాన్ని నిర్వహించి, అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేశారు.

విద్యుత్ చార్జీలపై నేడు ప్రజాభిప్రాయ సేకరణ

ప్రొద్దుటూరు : ఈ ఏడాది ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక ఆదాయం, అవసరాలు, విద్యుత్‌చార్జీలపై గురు, శుక్ర, శనివారాల్లో ఉదయం 10.30 నుంచి 1 గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం ఉంటుందని విద్యుత్ ఈఈ జి.శ్రీనివాసులరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నతాధికారులు విశాఖపట్నం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు తమ అభిప్రాయాలను, అభ్యంతరాలను తెలపవచ్చని కోరారు.

కడపలో కేఆర్ఎంబీని ఏర్పాటు చేయాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : కడపలో కృష్ణ రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ)ను ఏర్పాటు చేయాలని రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ములపాకు ప్రతాప్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేఆర్ఎంబీని కడపలో ఏర్పాటు చేసేందుకు రాయలసీమ ఎమ్మెల్యేలు కృషి చేయాలని ఆయన కోరారు.

మార్కెట్ యార్డు మాజీ చైర్మన్‌కు పరామర్శ

మైదుకూరు : మైదుకూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కటారి వీరన్నను బుధవారం ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పరామర్శించారు. ఇటీవల వీరన్న మోకాలుకు శస్త్రచికిత్స చేయించుకున్నారు. బుధవారం వనిపెంటలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించిన ఎమ్మెల్యే, కటారి వీరన్న ఇంటికి వెళ్లారు. వీరన్న ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

నేటి నుంచి వేదాంతం లక్ష్మణార్యుల ఆశ్రమ వార్షికోత్సవాలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక గీతాశ్రమంలోని బ్రహ్మశ్రీ జగద్గురు వేదాంతం లక్ష్మణార్యుల ఆశ్రమ వార్షికోత్సవాలను గురువారం నుంచి ఆదివారం వరకు శ్రీకాళహస్తి ఆశ్రమానికి చెందిన శ్రీరామ చైతన్య స్వామి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆశ్రమ అధ్యక్షుడు వద్ది నరసింహులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకలలో వివిధ రాష్ట్రాలకు చెందిన ఆధ్యాత్మిక వేత్తలు ప్రవచిస్తారని పేర్కొన్నారు. రోజూ ఉదయం, సాయంత్రం ధ్యానం, ఉపనిషత్ ప్రవచనాలు, గురుపూజ, భగవద్గీత పారాయణం, వేదాంత ఉపన్యాసాలు ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని కోరారు.

ఆడ పిల్లలను రక్షిద్దాం



రాజుపాళెం : అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులతో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

రాజుపాళెం : ఆడ పిల్లలను రక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి తెలిపారు. మండలంలోని తొండలదిన్నె గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో బేటి బచావో- బేటి పడావో కార్యక్రమంలో భాగంగా తల్లులకు, మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లింగ వివక్ష, లింగ నిర్ధారణ చేయకూడదని సూచించారు. బాలికల విద్యను ప్రోత్సహించాలని మహిళలు, తల్లులతో ప్రతిజ్ఞ చేయించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్మల, నరసమ్మ, మమత, బాలసుబ్బమ్మ, మహిళ పోలీసు లలిత, ఏఎన్ఎం సునీత, ఆశా కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

ఫ్రెండ్స్ సేవా సంఘం నూతన కమిటీ ఎన్నిక

బద్వేలు అర్బన్ : స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల 1983–84 ఎస్ఎస్‌సీ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫ్రెండ్స్ సేవా సంఘం నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. ఇందులో సేవా సంఘం అధ్యక్షుడిగా లాయంయోగయ్య, ప్రధాన కార్యదర్శిగా గంగసాని సాంబశివారెడ్డి, కోశాధికారిగా సముద్రాల శ్రీనివాసులు, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎన్.వెంకటసుబ్బారెడ్డి, గౌరవాధ్యక్షులుగా యర్రపురెడ్డి ఆనంద్‌రెడ్డి, వీరభద్రుడు, చిన్నిసుబ్బరాయుడు, ఆవుల వెంకటసుబ్బయ్య, బోవిళ్ల వేణుగోపాల్‌రెడ్డి, లీగల్ అడ్వైజర్‌గా దేవిరెడ్డి బ్రహ్మారెడ్డిలతో పాటు 7 మందిని గౌరవ సలహాదారులుగా, 6 మందిని ఉపాధ్యక్షులుగా, 5 మందిని సంయుక్త కార్యదర్శులుగా, 8 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యోగయ్య, సాంబశివారెడ్డిలు మాట్లాడుతూ చదువుకున్న ఊరికి సేవలందించి తమ రుణం తీర్చుకుంటామని తెలిపారు.

హామీలు నెరవేర్చిన ఏకైక సీఎం వైఎస్ జగన్

- టీడీపీ ఏం చేసిందో చెప్పాలి
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

మైదుకూరు : ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని వనిపెంటలో ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ఎమ్మెల్యే ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా అందిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకంటే ఎక్కువ మేలు చేకూర్చి వైఎస్ జగన్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్నారని కొనియాడారు. 2014–19 కాలంలో ప్రజలకేం చేశారో టీడీపీ నాయకులు చెప్పాలని సవాల్ విసిరారు. రాష్ట్రంలో చంద్రబాబు ఒక్క ఇంటి స్థలం కూడా ఇవ్వలేదన్నారు. సీఎం వైఎస్ జగన్ రైతులకు నాలుగేళ్లపాటు రూ.12,500 చొప్పున ఇస్తామని చెప్పి ఐదేళ్లపాటు రూ.13,500 చొప్పున రైతు భరోసా కింద ఇస్తున్నారని తెలిపారు. చంద్రబాబు రైతులకు, డ్వాక్రా మహిళలను మోసం చేశారన్నారు.

వనిపెంటకు రూ.17 కోట్ల లబ్ధి :

వైఎస్ జగన్ సీఎం అయ్యాక వనిపెంట సచివాలయ పరిధిలోని వారికి రూ.17 కోట్ల మేరకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరినట్టు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి తెలిపారు. రైతు భరోసా కింద 525 మందికి రూ.2,54,18,000, పంట నష్టం కింద 396 మంది రైతులకు రూ.65,98,181, ఇన్‌పుట్ సబ్సిడీ కింద 413 మంది రైతులకు రూ.27,76,170 లబ్ధి చేకూరినట్టు వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఇతర పింఛన్ల కింద 581 మందికి రూ.5.67 కోట్లు పంపిణీ చేసినట్టు పేర్కొన్నారు. ఇవికాక నాడు–నేడు కింద స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, జెడ్పీ హైస్కూల్‌ను అన్ని సౌకర్యాలతో తీర్చిదిద్దామని తెలిపారు. వనిపెంటలోని మరాట వీధిలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు కావాలని అడిగితే తక్షణమే పనులు చేపట్టాలని అధికారులు ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆదాం గౌస్ లాజం, జెడ్పీటీసీ వెంకటసుబ్బారెడ్డి, ఎంపీపీ థామస్, వైస్ ఎంపీపీ ఊటుకూరు రఘురామిరెడ్డి, ఎంపీటీసీ ఇర్షాద్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కటారి వీరన్న, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇడగొట్టు శేషు, మండల కన్వీనర్ గల్లా నరసింహారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ మూలె సుధాకర్‌రెడ్డి, బొర్రా సాంబ, బండి నాగేంద్ర ప్రసాద్, ఇరగంరెడ్డి శంకర్‌రెడ్డి, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీఓ కుళ్లాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు



లబ్ధిదారురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ, తదితరులు

బద్వేలు : రాష్ట్రాభివృద్ధి, సామాన్యుల సంక్షేమం రెండు కళ్లుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలన సాగిస్తుందని బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ తెలిపారు. బుధవారం పోరుమామిళ్ల మండలంలోని రంగసముద్రం పంచాయతీ సచివాలయం–1 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె ఇంటింటికీ తిరిగి పథకాల ద్వారా పొందిన లబ్ధిని వారికి వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజాసంకల్పయాత్రతో ప్రజల బాధలను దగ్గర నుంచి పరిశీలించి నవరత్నాల పథకాలకు రూపకల్పన చేశారని, అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేసి పేదలకు మేలు చేశారన్నారు. ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చిన ఘనత తమదన్నారు. తమ పాలనను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని రాబోయే ఎన్నికల్లో సైతం తమ ప్రభుత్వానికి మద్దతు పలకాలని, వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎం చేయాలని కోరారు. ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, పార్టీ మండల కన్వీనర్ సీ బాషా, రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు అల్లా, ఎంపీటీసీలు కవలకూరి రమణ, మహబూబ్ పీరా, చంద్రాయుడు, నాయకులు చిత్తా గిరిప్రణీత్ రెడ్డి, చాపాటి సాయి నారాయణరెడ్డి, రుద్రవరం ప్రసాద్, మాలకొండయ్య, ఎంపీడీఓ నూర్జహన్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలి



రోడ్డు భద్రతా వారోత్సవాల కరపత్రాలను విడుదల చేస్తున్న ఎంవీఐ శేఖర్‌రావు

బద్వేలు అర్బన్ : విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకుని రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి.శేఖర్‌రావు పేర్కొన్నారు. 34వ జాతీయ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక ఎస్ఆర్ఎస్‌బీ డిగ్రీ కళాశాల ఆవరణలో విద్యార్థులకు రోడ్డు ప్రమాదాల నివారణ–తీసుకోవాల్సిన జాగ్రత్తలు అనే అంశంపై అవగాహన సదస్సునిర్వహించి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా విద్యార్థులే మృత్యువాత పడుతున్నారని ఇటీవల కొన్ని అధ్యయనాలు తెలిపాయని, దీనిని బట్టి చూస్తే విద్యార్థులు ట్రాఫిక్ నిబంధలను పాటించకపోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నట్లు తెలుస్తుందన్నారు. విద్యార్థులు తమ వాహనాలను పరిమిత వేగంతో నడపడంతో పాటు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని సూచించారు. అనంతరం రోడ్డు భద్రతా వారోత్సవాల కరపత్రాలను విడుదల చేశారు. కళాశాల ఏఓ, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆర్.వి.సాయికృష్ణ, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, వైస్‌ప్రిన్సిపాల్ చలపతి, ఎంవీఐ కార్యాలయ సిబ్బంది అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతోనే రోడ్డు ప్రమాదాల నివారణ

- 18 నుంచి 24 వరకు రహదారి భద్రతా వారోత్సవాలు
- ప్రొద్దుటూరు ఆర్టీఓ సుశీల



రహదారి భద్రతా వారోత్సవాల ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న అధికారులు

ప్రొద్దుటూరు క్రైం : రహదారి నియమాలు పాటిస్తూ తగు జాగ్రత్తలు తీసుకుంటే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని ప్రొద్దుటూరు ఆర్టీఓ సుశీల అన్నారు. స్థానిక ప్రాంతీయ రవాణశాఖ కార్యాలయంలో బుధవారం ఆర్టీఓ, ట్రాఫిక్ సీఐ యుగంధర్ రహదారి భద్రతా వారోత్సవాలను ప్రారంభించి ఫ్లెక్సీలు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్టీఓ మాట్లాడుతూ రహదారి భద్రతా వారోత్సవాలు సందర్భంగా వారం రోజుల పాటు పోలీసు, రవాణాశాఖ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు, అవగాహన సదస్సులను నిర్వహిస్తామని చెప్పారు. ఇందులో ఆటో డ్రైవర్లు, ఆర్టీసీ డ్రైవర్లు, ప్రజలను భాగస్వామ్యం చేస్తామని తెలిపారు. విద్యార్థులకు పెయింటింగ్, వ్యాసరచన పోటీలను నిర్వహిస్తామన్నారు. ఎంవీఐ నారాయణనాయక్, ఏఓ రహంతుల్లా, ఆర్టీసీ డీఎం మల్లికార్జునరెడ్డి, ఆర్ అండ్‌బీ, మున్సిపల్ ఇంజినీర్లు లక్ష్మీనరసింహులు, సాయికృష్ణ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాగ్దేవి ఇంజినీరింగ్ కాలేజీలో..

మండలంలోని వాగ్దేవీ ఇంజినీరింగ్ కాలేజీలో బుధవారం సాయంత్రం రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీఐ నారాయణనాయక్ మాట్లాడుతూ బైక్‌లు, స్కూటీల్లో వెళ్లే విద్యార్థులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ ప్రమాదకరమని చెప్పారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాలను పరిశీలిస్తే ప్రమాదాల బారినపడిన వారిలో యువకులే అధికంగా ఉన్నారన్నారు. ఏఎంవీఐ పి. శ్రీనివాసరెడ్డి, రాజుపాళెం ఎస్ఐ రాజగోపాల్, డాక్టర్ వరుణ్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రామమోహనరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ



భూమి పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద రెడ్డి

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీ పరిధిలోని 40వ వార్డులో రూ.20లక్షలతో చేపట్టనున్న మురుగు కాలువ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాదరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీదేవి నాగరాజు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ రావులకొల్లు అరుణ నాగేంద్ర, 4వ వార్డు కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పోసా భాస్కర్, రాగా నరసింహారావు, శివోహం కమిటీ అధ్యక్షుడు శెట్టిపల్లె రాంప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

పట్టణంలోని వైఎంఆర్ కాలనీకి చెందిన నాయీబ్రాహ్మణ ప్రముఖులు బుధవారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిని కలిసి సన్మానించారు. అగస్త్యేశ్వర స్వామి ఆలయ నూతన కమిటీలో సభ్యురాలిగా డోలు పెద్దన్న సతీమణి భారతిని నియమించేందుకు అవకాశం కల్పించిన ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజలకు సత్వర సేవలు అందించాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులు

ప్రొద్దుటూరు : ఆలస్యం లేకుండా ప్రజలకు సత్వర సేవలు అందించి మన్ననలను పొందాలని జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాసులు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం వీఆర్‌ఓలతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆర్డీఓ మాట్లాడారు. ప్రజలు దరఖాస్తు చేసుకున్న కుల, ఆదాయ, ఇతర సర్టిఫికెట్లను నిర్దేశించిన గడువుతో సంబంధం లేకుండా పరిశీలించి వెంటనే ఇవ్వాలని చెప్పారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని, ఎక్కడ అక్రమ నిర్మాణం చేపట్టినా వెంటనే ఆపాలని తెలిపారు. రీ సర్వేలో కూడా జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఓటర్ కార్డులకు ఆధార్‌కార్డుల అనుసంధానం ఇంకా 32 శాతం చేయాల్సి ఉందన్నారు. పెన్నా పరివాహక ప్రాంతంలో కొత్త నిర్మాణాలు చేపట్టకుండా చూడాలని తెలిపారు. సమావేశంలో ఇన్‌చార్జి తహసీల్దార్ జె.సుభాని, డిప్యూటీ తహసీల్దార్ జె.మనోహర్‌రెడ్డి, ఆర్ఐలు నాగ మోహన్‌రెడ్డి, సతీష్, వీఆర్ఓలు పాల్గొన్నారు.

భద్రతే ముఖ్యం



వాహనదారులకు రోజాపూలు ఇస్తున్న సీఐ హనుమంతనాయక్, ఎస్ఐ చంద్రశేఖర్‌లు

గోపవరం : భద్రతే ముఖ్యంగా భావించి వాహనదారులు ప్రయాణం చేయాలని బద్వేలు రూరల్ సీఐ హనుమంతనాయక్, ఎస్ఐ చంద్రశేఖర్‌లు విజ్ఞప్తి చేశారు. బుధవారం సాయంత్రం శ్రీనివాసపురం వద్ద నెల్లూరు–ముంబై జాతీయ రహదారిపై వాహనాల తనిఖీని వారు నిర్వహించారు. వచ్చేపోయే వాహనాలను ఆపి హెల్మెట్, సీట్‌బెల్టు ధరించాలని రోజా పూలు ఇచ్చి విన్నవించారు. ఇటీవల కాలంలో హైవే రోడ్లపై ద్విచక్ర వాహనదారులే ప్రమాదాలకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీటు బెల్టు ధరించి ప్రయాణించాలన్నారు. మీ మీద మీ కుటుంబ సభ్యుల జీవితాలు ఆధారపడి ఉన్నాయని గుర్తించి ప్రయాణం చేయాలన్నారు. హెల్మెట్, సీటు బెల్టు ధరించి వెళుతున్న వాహనదారులను ఆపి వారికి కూడా రోజా పూలు అందించి ఇలాగే ప్రయాణాలు చేయాలని వారిని ప్రోత్సహించారు. అనంతరం రికార్డులు సక్రమంగా లేని వాహనదారుల నుంచి అపరాధ రుసుము వసూలు చేశారు.

పసుపు ఎగుమతిలో నాణ్యత ముఖ్యం



మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ శ్రీధర్

మైదుకూరు : పండించిన పసుపు పంటను ఎగుమతి చేయడంలో నాణ్యత ముఖ్య పాత్ర పోషిస్తుందని అనంతరాజుపేట ఉద్యాన పరిశోధన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీధర్, పులివెందుల అరటి పరిశోధన కేంద్రం అధిపతి, శాస్త్రవేత్త డాక్టర్ టి.సుశీల అన్నారు. మండలంలోని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రంలో బుధవారం పులివెందుల అరటి పరిశోధన నేతృత్వంలో పసుపు సాగుపై రైతులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంచి యాజమాన్య పద్ధతులతో పసుపులో అధిక దిగుబడులతోపాటు నాణ్యమైన పసుపును పండించవచ్చని పేర్కొన్నారు. పసుపు సాగులో యాజమాన్య పద్ధతులు, కోత అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. శాస్త్రవేత్తలు శ్రీవిద్యారాణి, సందీప్‌కుమార్, సునీల్‌కుమార్, రేష్మ, దత్తారెడ్డి, ఫిరోజ్‌హుస్సేన్, హర్షిత, కాంతిశ్రీ రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు.

ఘనంగా విశ్వశాంతి దినోత్సవం



శాంతి స్థూపం వద్ద ఓంశాంతి భవనం నిర్వాహకులు



పోరుమామిళ్లలో బ్రహ్మకుమారిలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక విజయనగరం వీధిలోని ఓంశాంతి భవనంలో ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయ వ్యవస్థాపకుడు బ్రహ్మబాబా 54వ పుణ్యతిథి సందర్భంగా విశ్వశాంతి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పుదుచ్చేరికి చెందిన అమృతానందమయి ట్రస్టు మేనేజర్ శ్రీనివాసులు, ఓంశాంతి భవన్ నిర్వాహకురాలు బీకే శాంత బ్రహ్మ బాబా గొప్పతనాన్ని వివరించారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీలు తదితరులు పాల్గొన్నారు.

ఓంశాంతి భవన్‌లో విశ్వశాంతి దినోత్సవం

పోరుమామిళ్ల : బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయ వ్యవస్థాపకులు బ్రహ్మబాబా 52వ స్మృతిదినం సందర్భంగా బుధవారం పోరుమామిళ్లలోని ఓంశాంతి భవన్‌లో నిర్వాహకురాలు స్వప్న ఆధ్వర్యంలో విశ్వశాంతి దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1969 జనవరి 18న బ్రహ్మబాబా దేహాన్ని త్యాజించినందున ఈ రోజు ఆయన గుర్తుగా విశ్వశాంతి దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఓంశాంతి సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



నట్టల నివారణ మందు తాపుతున్న పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వైకుంఠరావు

దువ్వూరు : గ్రామాల్లో రైతులు ఉచిత పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రొద్దుటూరు పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వైకుంఠరావు పేర్కొన్నారు. మండల పరిధిలోని మురళీనగర్‌లో బుధవారం జాతీయ సేవా పథకంలో భాగంగా రైతులకు ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వైకుంఠరావు మాట్లాడుతూ పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులు, గర్భకోశ వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. అనంతరం దూడలకు, జీవాలకు నట్టల నివారణ మందు తాపారు. కార్యక్రమంలో సర్పంచ్ మదార్‌బీ, ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి, పశువైద్య డాక్టర్లు వెంకటసుబ్బయ్య, ఫణీంద్రా రెడ్డి, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ ప్రవేశ పరీక్షా కేంద్రాల పరిశీలన



ట్రెజరీ కార్యాలయంలోని స్ట్రాంగ్ రూంను పరిశీలిస్తున్న అధికారులు

ప్రొద్దుటూరు క్రైం : కానిస్టేబుల్ ఉద్యోగాల ఎంపిక కోసం నిర్వహించనున్న ప్రవేశ పరీక్షా కేంద్రాలను బుధవారం సాయంత్రం కడప అడిషనల్ ఎస్పీ తుషార్ డూడీ, ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేరణాకుమార్ పరిశీలించారు. ఈ నెల 22న నిర్వహించనున్న కానిస్టేబుళ్ల ప్రవేశ పరీక్షకు సంబంధించి ప్రొద్దుటూరులోని 23 కేంద్రాల్లో 12,347 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో పట్టణంలోని వైవీఎస్ బాలికల ఉన్నతపాఠశాల, పాలిటెక్నిక్ కాలేజీ, యోగి వేమన యూనివర్సిటీ ఆఫ్ వైఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాలలను అధికారులు పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో చేయాల్సిన ఏర్పాట్లపై సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం సబ్‌ట్రెజరీలోని స్ట్రాంగ్ రూంను పరిశీలించారు. వారి వెంట త్రీ టౌన్ సీఐ నారాయణయాదవ్, ఎస్ఐ కృష్ణంరాజునాయక్ ఉన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు



పోటీలను ప్రారంభిస్తున్న పంచాయతీ సెక్రటరీ వీరశేఖర్‌రెడ్డి

బద్వేలు అర్బన్ : చదువుతో పాటు క్రీడల్లో రాణించే విద్యార్థులు, యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మాజీ ఎంపీపీ అంబవరం వెంకటేశ్వర్‌రెడ్డి, వీరపల్లి సర్పంచ్ అనూష, పంచాయతీ సెక్రటరీ వీరశేఖర్‌రెడ్డిలు పేర్కొన్నారు. సంక్రాంతి సందర్భంగా పంచాయతీ పరిధిలోని కొత్తచెరువు గ్రామంలో కొత్తచెరువు ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను బుధవారం ప్రారంభించారు. తొలుత బ్యాటింగ్ చేసి పోటీలను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మల్లేశ్వర్‌రెడ్డి, పంచాయతీ నాయకులు శాంతకుమార్, నాగార్జున, టోర్నమెంట్ ఆర్గనైజర్లు తదితరులు పాల్గొన్నారు.

కాలువ పూడ్చారని ఫిర్యాదు



కాలువ పూడ్చిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తెలుగుగంగ అధికారులు

బద్వేలు అర్బన్ : మండల పరిధిలోని గొడుగునూరు సమీపంలోని తెలుగుగంగ డిస్ట్రిబ్యూటరీ కాలువ పూడ్చివేశారని గొడుగునూరు గ్రామానికి చెందిన రైతులు బుధవారం తెలుగుగంగ జేఈలతో పాటు తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. గొడుగునూరు గ్రామ సమీపంలోని సర్వే నెంబర్ 276/7ఏ, 276/6ఏ లలోని తెలుగుగంగ డిస్ట్రిబ్యూటరీ కాలువను సమీపంలోని ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు పూడ్చివేశారని, దీని వలన రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న తెలుగుగంగ జేఈలు జయచంద్రబాబు, రాజశేఖర్‌లు కాలువ పూడ్చివేసిన ప్రాంతాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. అలాగే ఇదే విషయంపై తహసీల్దారుకు, రూరల్ పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

వైద్యసేవలను సద్వినియోగం చేసుకోండి



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ప్రశాంతి

కాశినాయన : వైద్యసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రశాంతి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని గొంటువారిపల్లె గ్రామంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు, బాలింతలకు, చిన్న పిల్లలకు, రక్తహీనత ఉన్న వారికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే బీపీ, షుగర్, ఆస్మా రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ప్రజలు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వైద్యసేవలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి సుబ్బరాయుడు, ఆరోగ్య పర్యవేక్షకులు బాలయ్య, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

యోగా ద్వారా సంపూర్ణ ఆరోగ్యం

– సిద్ధ సమాధి యోగా ఆచార్యులు నాగసుబ్బారెడ్డి

చాపాడు: ప్రతి రోజూ యోగా చేయటం వలన ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యం పొందుతారని సిద్ధ సమాధి యోగా ఆచార్యులు దేవగుడి నాగ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చియ్యపాడు గ్రామంలో బుధవారం జాతీయ యువజనోత్సవాలలో భాగంగా కడప నెహ్రూ యువ కేంద్రం సహకారంతో మైదుకూరుకు చెందిన అమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో యోగా పై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. చియ్యపాడులోని మూల పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద యోగాపై నాగసుబ్బారెడ్డి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా చేయటం ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. కార్యక్రమంలో అమ్మ సేవా సమితి అధ్యక్షుడు శివశంకర్, గ్రామ స్వరాజ్ ఏకల్ అభియాన్ వెంకట రమణ, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆరోగ్యశ్రీ అపర సంజీవని

కడప కార్పొరేషన్ : డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం పేదల పాలిట అపర సంజీవని అని ఉప ముఖ్యమంత్రి ఎస్బీ అంజద్‌బాషా అన్నారు. బుధవారం హోలిస్టిక్ ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆరోగ్యశ్రీ హెల్ప్ డెస్క్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత వైఎస్సార్ ప్రారంభించిన ఈ పథకానికి ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక మెరుగులు దిద్దారన్నారు. గతంలో 2500 వ్యాధులకు ఆరోగ్యశ్రీలో చికిత్స అందిస్తుండగా, ప్రస్తుతం 3500 వ్యాధులను చేర్చారన్నారు. 104, 108 నంబర్లకు ఫోన్ చేసి వైద్య సహాయం పొందవచ్చని, ఎక్కడా అవినీతికి ఆస్కారం లేకుండా 14400 టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. డీఎంఅండ్‌హెచ్ఓ కె. నాగరాజు, హోలిస్టిక్ ఆసుపత్రి వైద్యులు శ్రావణ్‌కుమార్, మోహన్‌రావు, క్రాంతి కుమార్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.